# టుర్‌యు, టుర్‌యు, టుర్ర్ర్ర్ర్ర్యు.

బెజవాడకి ప్రయాణమై నేను ఏలూరు స్టేషను కెళ్ళాను. ప్లాట్ ఫారం మీద "మాస్టారూ, మాస్టారూ" అన్న పిలుపు విని వెనక్కి చూసాను సుమారు పాతికేళ్ళ యువకుడొకడు నావైపొస్తున్నాడు దగ్గరకొచ్చి నమస్కారం పెడుతూ అన్నాడు "నేను మేస్టారూ, అయిదేళ్ళకిందట పచ్చగళ్ళ చొక్కాతో మీ కాలేజీలో పరీక్ష రాసినవాణ్ణి, శ్యాంని, రండి కాఫీ తాగుదాం."

అతన్తో నడుస్తున్నానే కానీ నా మనస్సు మాత్రం జ్ఞాపకాల పొరల్లోకి తొంగి చూస్తోంది. చటుక్కున స్ఫురించింది. ఆనాటి ఆ అందమైన అనుభవం !

★ ★ ★

ఏప్రియల్ నెల, మా కాలేజీలో పరీక్షలు జరుగుతున్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫీసరుగా వెళ్ళవలసినవాణ్ణి వెళ్ళకుండా కొన్ని కారణాల వల్ల మా కాలేజీలోనే వాచర్‌గా పనిచేస్తున్నాను.

మా కాలేజీ పెద్దదిబ్బ మీదుంది. (కోటదిబ్బ అంటారు) ఈ దిబ్బలో ఒక అంచు పొడుగూనా తరగతులుండే రెండు షెడ్లున్నాయి. ఈ షెడ్లకి పది పన్నెండు గజాల దూరంలో ఈ 'కోటదిబ్బ' అంచు స్పష్టంగా కనిపిస్తుంది. అక్కణ్ణించి మూడు నిలువుల లోతులో ఊళ్ళో వాళ్ళ ఇళ్ళు మొదలవుతాయి. వాటిప్రహరీగోడల్తో, ప్రహరీ గోడలికీ దిబ్బ అంచుకీ మద్య మనిషి నడిచేటంత వెడల్పు సందుంది. ఈ షెడ్ల దగ్గర్నించి దిబ్బ అంచుదాకా ఉన్న ఆ పదిహేనూ ఇరవై గజాల దూరంలోనూ షెడ్లున్నంత పొడుగునా చాలా రకాల మొక్కలు చెట్లు స్వేచ్ఛగా ఎదిగిపోయి ఒక చిన్న సైజు అడివిని జ్ఞాపకం చేస్తున్నాయి. ఓ రెండు డజన్లు పైగా పక్షులకి ఈ అడివి విహారస్థలమని ఇంతకు మునుపెప్పుడూ గమనించకపోవటం నా దురదృష్టం! అయితే ఇప్పుడు గమనించాక మాత్రం, "సృష్టిలో ఇంతటి అద్భుతమైన అందమూ స్పందనా ఉన్నాయి గదా!" అని ఆనందించకపోవటం ఇంకో దురదృష్టమవుతుంది. కనక, ఈ రెండో దురదృష్టాన్ని నా ఛాయలకి రానివ్వకూడదని నిర్ణయించుకున్నాను, మొదటి పరీక్షరోజునే - సృష్టిలోని సూత్రబద్ధతను గమనించిన ఆ మొదటిరోజునే.

జవాబు పుస్తకాలు పంచి పెడుతూనే కుర్రాళ్లకి హెచ్చరిక చేసేసాను. "మీరు దొంగలుకారు, నేను పోలీసును కాను. వీలైనంతబాగా మీరు పరీక్ష రాసేందుకు సహకరించేందుకే నేనిక్కడున్నాను. కానీ స్లిప్పులు - పొరపాటున మీ తమ్ముళ్ళో మీ చెల్లాయిలో మీ జేబుల్లో పెట్టినవి - ఉంటే ఇప్పుడే వెళ్ళి చెత్త బుట్టలో పారేసిరండి. ఆ తర్వాత కాని పని చేసి మీరు నాకు దొరికిపోతే మాత్రం నావిధిని నేను నిర్వహించటానికి ఏమాత్రమూ వెనకాడను." నిజానికి ఈ మాటలు చెప్పటం అనవసరం. కొన్నేళ్లుగా నన్ను శోధన చేస్తున్న ఈ కుర్రాళ్ళకి -నేను నాకు నేను తెలిసిందానికంటే బాగా తెలుసు- అని నాకు తెలుసు. అయినా నా విధిని నేను నిర్వహించాలి గదా!

పరీక్ష మొదలైంది. పావుగంట గడిచింది.గదిలో కుర్రాళ్ళంతా శ్రద్ధగా రాసుకుంటున్నారు. కానీ కంటికి వైపున్న వరసలో మొదటివాడుగా, మూలగా కూర్చున్న పచ్చగళ్ల చొక్కావాడు మాత్రం మధ్య

మధ్య తలెత్తి నావైపు దీనంగా చూస్తున్నాడు. నేను మొహం బిగించి తీక్షణంగా చూసాను. వాడు కంగారుపడి తలవంచేసుకున్నాడు.

★ ★ ★

క్కీక్కొక్కుయీ... క్కీక్కొక్కుయీ... క్కీక్కొక్కుయీ.

- హఠాత్తుగా వినిపించిన ఈ శబ్దానికి అడవి వైపు చూసాను. సీమ తుమ్మ చెట్టుమీద పక్షొకటి, కొమ్మ చివర కొచ్చి కూర్చుని కూస్తోంది! దాని తలంతా నలుపూ, మిగిలిన శరీరం బూడిద రంగూ, ఆ తలమీద నల్ల ఈకలపాగా, పొడుగాటి తోకా, ఆ తోక కింద ఎరుపూ, ఈ విధంగా ఉన్న ఆ పక్షికి అది కూసినప్పుడు తోక పైకి లేస్తుందా? అనేది నా కొచ్చిన మొదటాలోచన! అసలు పక్షులెందుక్కూస్తాయనేది మూడో ఆలోచన!

"క్రిణ్యావ్, క్రిణ్యావ్, క్రిణ్యావ్, క్రిణ్యావ్, క్రిణ్యావ్,.... .. "

హడావిడిగా వినిపించిన ఈ గోల శబ్దానికి రెండోవైపు కాలేజీ లోతట్టువైపు చూసాను. ఆ పక్కన ఉన్న బ్రహ్మాండమైన మర్రి చెట్టు మీదున్న ఒక రామచిలుక అదేపనిగా అరుస్తోంది. రెండు నిముషాలయ్యే సరికి ఎవరో పిలిచినట్టుగా రెండు చిలకలు ఎక్కణ్నుంచో వచ్చి దాని పక్కనే వాలాయి. ఇప్పుడు ఆ మూడూ అరవటం మొదలెట్టాయి. ఇంకో రెండు నిముషాలకు ఓ పాతిక చిలకలు గోలగోలగా వచ్చి కొమ్మల మీద వాలాయి. జంటలుగా విడిపోయాయి.

" గ్రి-జ్ఞ-వ్ గ్రి-జ్ఞ-వ్ గ్రి-జ్ఞ-వ్,...."

అంటూ సన్నని గురక వంటి కూతల్తో ఒకదాన్నొకటి ముక్కుల్తో పొడుచుకుంటున్నాయి. అది నాకు సరసంగా నాకర్థమైంది. మరి, ఆమని ఆగమనం పక్షుల్లో సరసానికి దోహదం కదా! రెండు మూడు నిముషాల తర్వాత వేగంగా ఎక్కణ్ణుంచో..."

" గ్రీఈక్జ్ఞ, గ్రీఈక్జ్ఞ, గ్రీఈక్జ్ఞ, గ్రీఈక్జ్ఞ,.గ్రీఈక్జ్ఞ,...."

అని వినిపించ సాగింది. అంతే. ఈ చిలకల్లో ఒక రెండు చిలకలు పై కొమ్మల మీది కెగిరాయి.ఇవ్వికూడా అట్లాగే పంతంగా అరవసాగాయి.అదరచరిచి ఒక్కసారిగా పైకెగిరాయి. అంతే అన్నీ ఎగిరి చక్కాపోయాయి!

గంట గడిచింది.

" ర్ప్చ ర్ప్చ,ర్ప్చ,ర్ప్చ,...."

- ఓ వందొచ్చి నట్టొచ్చి కందకం వైపున్నసీమ చింత చెట్టు మీద వాలాయి పిచ్చికలు.

" ప్లిచ్చివ్, ప్లిచ్చివ్,ప్లిచ్చివ్,. .."

అంటూ ఇంకో పాతికొచ్చి వాలాయి గోరువంకలు. అంతవరకూ ఆ కొమ్మల మీదనే ఉన్నాయి కాబోలు రామచిలకలు, నాక్కనబడనే లేదు. వీటినన్నింటినీ ఆహ్వానిస్తున్నయ్యా అన్నట్టు ఒక్కసారిగా గోల - గోలగా అరుస్తూ... గాల్లో కెగిరి టపటపా రెక్కలాడించి వెంటనే విరగ పండిన సీమ చింతకాయల మీద స్థిరపడి పోయాయి. ఆ ఆకుల రంగులో కలిసి పోయాయి

ఇంకో కొత్త సందేహం నాబుర్రని తొలవటం మొదలెట్టింది. " మనుసుల కున్నట్టే పక్షులక్కూడా ఒక్కో ఇంగితానికి ఒక్కో భాషా, ఆ భాషకి తగిన చర్యా ఉంటాయా?"

నా అదృష్టమా అన్నట్టు నాతోటి లెక్చరర్లు గదుల్ని పర్యవేక్షిస్తూ నాగది దగ్గర కొచ్చారు నా గది

లోపలికి రానవసరం లేదనుకున్నారు. అట్నుంచటే పక్క గది కెడుతున్నారు. వాళ్ళల్లో ఉన్న జూవాలజీ లెక్చరర్ హైమవతిని పిలిచాను. "పక్షులక్కూడా మూడ్‌ను బట్టి భాష మారుతుందా?" అనామెనడిగాను.

ఆమె ఆలోచించింది " పక్షుల భాషని గురించి . మేం . చదువుకోలేదే! అయినా, భాష... అదే, మనకి లేదూ, కోపంలో ఒకరకంగానూ, ఏడుపులో ఒకరకం గానూ, ఇంకో సమయంలో ఇంకో రకంగానూ- అట్లాగే వాటికీనూ! ఏవన్నా చెప్పారేమో.. జ్ఞాపకం లేదు. అయినా లెక్కల వారు మీ కీ గోలెందుకిప్పుడు!" అని సాగదీసింది. మిస్ హైమవతి వెళ్లిపోయింది నేను హతాశుణ్ణయ్యాను!

కుర్రాళ్ళందర్నీ ఓ మాటు నిశితంగా చూసాను. మూలనున్న పచ్చగళ్ళ చొక్కావాడు కొంచె పక్కకి తిరిగి అడ్డంగా కూర్చున్నాడు. కాలేజీలో చాలినన్ని బెంచీల్లేక మా వైపు గదుల్లో కుర్రాళ్ళని కిందే కూర్చోబెట్టారు కనక పక్కకి తిరిగిన వాణ్ణి అదరగొట్టలేం అదరగొట్టాలని ప్రయత్నిస్తే వాడు, "పాంటుగదా పక్కకి తిరిగి గోక్కున్నాను. తప్పా?" అని మన్ని అదరగొడతాడు కనక అదిలించగలం. అంతే . నా ప్రవృత్తిని బట్టి అంత పని గూడా నేను చెయ్యలేదు సూక్ష్మంగా ," సరిగ్గా కూర్చోవోయ్, లేకపోతే నీలాంటి మంచివాణ్ణి అనుమానించాల్సొస్తుంది" అన్నాను వాడు బేలమొహం వేసేసి టక్కున సరిగ్గా కూర్చున్నాడు దూరంనించి అంటే అడివి చివర, కాలేజీ మూలమీద, నా గదికి వెనకవైపుగా ఉన్న వేపచెట్టుమీంచి

'ఖ్లోక్.. ఖ్లోక్... ఖ్లొక్... ఖోక్.. ' అనే లోతుగొంతు కూత వినిపించసాగింది. ఇది బీడు భూముల్లో సర్వసాధారణంగా వినిపించే పిట్టకూతే నా చిన్నప్పుడు నేను లాగూ ఎగలాక్కుంటూ కృష్ణ ఒడ్డునున్న నూతక్కిపొలంగట్ల మీద తిరుగుతూ విన్నదే.కానీ ఆ పక్షి ఏదో మర్చిపోయాను. కనక ఇప్పుడొచ్చిన అవకాశం ఉపయోగించుకుందామని గది బయటికి తొంగి చూసాను.

నా వెనకాల్నించి పచ్చ గళ్ల చొక్కావాడన్నాడు. "అది గద్దపిల్ల సార్. మా పెదవేగి తుమ్మ చెట్లల్లో నేనెప్పుడూ వింటూంటా న్సార్!"

వెనక్కి తిరిగాను. "నాకు తెల్సులే, నువ్వు రాసుకో! "అన్నాను వాడు బిక్క మొహం వేసేసాడు.ఆ తర్వాత నేను జవాబు పుస్తకాలు అందుకోటంలో పడిపోయాను.

★ ★ ★

నాకు కిందటిరోజు మొదటిగది పడితే, మర్నాడు రెండో గది పడింది.కిందటిరోజు మొదటి గదిలో కుర్రాళ్లు కొంతమందివ్వాళ నా గదిలో కొచ్చారు. వాళ్లల్లో పచ్చగళ్ళ చొక్కావాడు కూడా ఉన్నాడు! అయితే వాడిస్థానం ఈ సారి గది మధ్యలో కొచ్చింది.

పరీక్ష మొదలైంది. ఎనిమిదిన్నర దాటింది ఎండ, వేసవి వేడినందుకొంటోంది. నా దృష్టి హఠాత్తుగా నా గదికి అనుకొనున్న సీమ తుమ్మ చెట్టుకింద చెలరేగిన కదలికమీద పడింది. కాకి పరిమాణంలో ఉండి సుమారు తొమ్మిదంగుళాల తోకుండి, బూడిద రంగు చుక్కలూ నీలం కంఠమూ, కళ్ల చుట్టూ ఎరుపూ అన్న ఒక పక్షి అట్లాంటిదే మరో పక్షిని తన ముక్కుతోపొడుస్తూ రెక్కల్తో కొడుతూ మీది కెడుతోంది. నా కదేదోవిచిత్రంగా అనిపించి అట్లా చూస్తూ నుంచుండిపోయాను గది మధ్యలోనే.

పచ్చగళ్ళ చొక్కావాడు. " అయ్యి గువ్వలండి మాస్టారూ. ఆ గువ్వ తన రాజ్యంలో కొచ్చిన ఇంకో గువ్వని తరిమేస్తా వుంది " అన్నాడు.

" నిన్నెవడడిగాడు నీ పన్చూసుకో!" అన్నాను నిజంగానే కళ్ళెర్ర చేసాను. కాని లోలోపల వాడి విజ్ఞానానికి మాత్రం ముచ్చట పడ్డాను

'కులోకు... కులోకు... ళొకు ళొకు కుళొకళోకు కుళోకు . కుళొకుకుళొకుళొకు. '

ఈ చిత్రమైన శబ్దానికి నేను గది చివరికెళ్ళి దిబ్బమూల మీదున్న వేపచెట్టును పరిశీలించాను అది కోకిల అదట్లా రెండు మూడు నిముషాలపాటు నిర్విరామంగా కూసి కూసి ఆగింది. ఎక్కణ్ణుంచొచ్చిందో ఇంకో కోకిల రఁయ్‌న ఎగురుకుంటూ వచ్చేసి దీని పక్కన వాలింది మొదటిది దీన్ని.

'కువ్వ, కుఁవ్వకుఁవ్వ.కుఁవ్వ...'

అంటూ గోముగా ముక్కుతో పొడవసాగింది ఇంతలో ఎక్కడో దూరంనుంచి ఇంకో కోకిల తాలూకు వసంతరాగం వినిపించసాగింది. అంతే మొదటికోకిల సర్రున ఎగిరి వేపచెట్టు పైకొమ్మల్లోకి దూరి, దూరి పోయి దాక్కుని కూర్చుంది. ఇహ నిర్విరామంగా తన రాగం మొదలెట్టింది.

'క్కుజ్‌ఊఁఊ, క్కుజ్‌ఊఁఊ,.. ఆ కోకిల రెట్టించింది ఇదీ రెట్టించింది. రెట్టించి రెట్టించి మహా తీవ్రస్థాయి కెళ్ళిపోయింది.

'క్కుజ్‌ఊఁఅ, క్కుజ్‌ఊఁఅ, క్కుజ్‌ఊఁఅ,' ఏం వచ్చిందో , అంత తీవ్రస్థాయిలోనూ టక్కున తన రాగం ఆపేసింది. 'కుళొకుళొకు.. కుళోకుళోకు... కుళోకుళోకు' అంది. కింది కొమ్మమీదున్న దాని ఆడజోడు సర్రున ఎగిరొచ్చి దీన్ని కలిసింది. (అవును ఆడజోడే! రాగం పాడేది మగకోకిలే!) రెండూ కలిసి తుర్రుమని ఎటో ఎగిరిపోయాయి!

'యురేకా, తెలిసిపోయింది!' నాలో నేనే అరుచుకున్నాను. పక్షులెందుక్కూస్తాయో తెలిసిపోయింది! ఒకటి తమ వాటిని పిలుచుకోటానికీ, రెండు తమ పౌరుషాన్ని ప్రకటించుకోటానికి! తమ వాళ్ళని పిలవటానికి పొట్టివైన అందంలేని కూతలోనే 'మూడ్'ను బట్టి తేడాలుండొచ్చు. ( అయితే- ఈ లెక్కన ప్రతి పక్షికి తనదైన స్వరం దాని కూతలో ప్రత్యేకంగా ఉండాలిగదా, అది తన జంటను మాత్రమే పిలవగలిగేట్టు . అట్లా ఉంటుందా?... ఏమో!) ఇంక తమ పౌరుషాన్ని ప్రకటించు కోవలసినప్పుడు, ఉద్రేకంతో, లోలోతు గొంతుతో, పొడవైన కూత- పాట- పాడతాయి. అన్ని పక్షుల్లోకీ కోకిలే అందమైన పాటగాడు. కోకిల తాలూకు ఆ లోలోతు గొంతు పాటను ఏడుస్వరాల్లోని పంచమ స్వరంగా వర్గీకరించారు పెద్దలు.

ఇంతలో హఠాత్తుగా ప్రత్యక్షమయిందొక ఉడత మద్దిచెట్టు కింద. ఎటో చూస్తూ అది పొట్టికూతలు కూస్తూ అటూ ఇటూ తిరుగుతోంది.

'క్చుర్ర్‌ప్..క్చుర్ర్‌ప్.. క్చుర్ర్‌ప్...

హఠాత్తుగా ఆ పిల్లి ఒకటి కందకం పక్కనున్న ఇళ్ళల్లోంచి ఇవతలికి దూకి మద్దిచెట్టు కిందగా వచ్చింది అంతే ఈ ఉడత ఝుంగున చెట్టు కొమ్మమీదికి దూసుకెళ్ళిపోయి అక్కడ్నించి అదే పనిగా అరవటం మొదలు పెట్టింది

' క్చుర్ర్ర్ర్ర్ర్ర్ర్ర్‌ప్.. క్చుర్ర్ర్ర్ర్....'

ఇది పొడుగుకూత. ఇది దాని ఆపత్కాలపు పాట. ఇది ఇతర ఉడతలకూ పక్షులకూ ప్రమాదం హెచ్చరిక?

నా సిద్ధాంతం అదే, పక్షులు వేరు వేరు సందర్భాల్లో వేరు వేరు భాషలుపయోగించును- అనేది ఉడతల్లో కూడా ఋజువైంది! హాఁహాఁహాఁ- నాలో నేనే వీపు చరుచుకున్నాను

టైము పదయింది పచ్చగళ్ళ చొక్కావాడు హడావిడేం చెయ్యటంలేదు అసలు గదంతా ప్రశాంతంగానే ఉంది ఇతర కుర్రాళ్ళకీ అదనం పుస్తకాలిచ్చాను దారం ముక్కలిచ్చాను కాళ్ళు లాగుతూంటే

వెళ్ళి కుర్చీలో కూర్చోబోయాను

'గ్లువా, గ్లువా, గ్లువా, గ్లువా...'

- ఈ కూతకి నేను లేచి నా పక్కనున్న మూడో నెంబరు గది గోడ దగ్గరకొచ్చి చెట్లకేసి చూసాను పిచ్చికల్లాంటి వాటికన్న కొంచెం పెద్దవైన రెండు పిట్టలు! ఎప్పుడొచ్చివాలాయో! ముందర అరిచిన పిట్ట అదే అరుపునందుకొంది అది ఆపింది. ఆ తర్వాత రెండూ కలిసి జంటగా పాట నందుకొన్నాయి. అయిదారు నిముషాలు అట్లా పాడి పాడి ఎగిరెళ్ళిపోయాయి అవ్వి ఎంత జంటగా పాడాయంటే ఆ దృశ్యం చూడని వాళ్ళకి అది ఒక్కపిట్ట పాడిన పాటలాగే అనిపిస్తుంది ఖచ్చితంగా!

నా మనస్సు ఆనందంతో ఊగిపోయింది! ఇంకో కొత్త విషయం. అదే ' పిట్టలు డ్యూయెట్లు కూడా పాడును' అనే దాన్ని కనుక్కొన్నా నివ్వాళ? వెల్ మైబాయ్, యూహేవ్ గాన్ ఏ లాంగ్ వే ఇన్ బర్డ్ రీసెర్చ్! ముందు ముందు ఇంకెన్ని కనుక్కుంటావో! విష్ యూ ఏ హేపీ పిరియడ్ ఎహెడ్!'' ఆనందం ఆపుకోలేక నాలో నేనే నవ్వుకుంటూ అటూ ఇటూ వేగంగా పచార్లు చేసాను.

పచ్చగళ్ళ చొక్కావాడు నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా నావైపే చూస్తున్నాడు నా ఆనందం కారణాన్ని వాడు పట్టేసాడేమో తెలీదు. నేను మాత్రం వాణ్ణి పట్టించుకోలేదు, ఆ పూట వాడు అంత బాగా రాసినట్టు కూడా లేదు.

★ ★ ★

మూడో నాడు పరీక్షకి నేనుమళ్ళీ వెనక్కి ఒకటో నెంబరు గదికే వచ్చాను చిత్రంగా, ఆ పచ్చగళ్ళ చొక్కావాడు కూడా మళ్ళీ ఆ గదికే చేరాడు! అయితే ఈ సారి వాడు కందకం వైపున్న వరసలో చివ్వరివాడుగా తేలాడు. మొదట్లో నేను గదిలో కెళ్ళేసరికి వాడు వాడి చోట్లోనే నుంచొని దిక్కులు చూస్తున్నాడు.

నేనెళ్లి టేబిలు మీద పుస్తకాలు పడేసి గదంతా కలియజూసేసరికి హడావిడిగా వాడు బయట కెళ్లిపోయాడు నా గదికి వెనకవైపు వేపచెట్టుకింద పాయిఖానా లున్నాయి. అదే కాలేజీకి మూలవైపు నేను జవాబుల పుస్తకాలు పంచుతుండగా వాడు వచ్చి సీట్లోకి చేరాడు కాస్సేపటికి నేను అందరికీ ప్రశ్న పత్రాలు కూడా ఇచ్చేసాను. నా పన్లో నేనుండిపోయాను. పది నిముషాలయ్యేసరికి వాడు నుంచుని, 'పాస్ కెళ్లాలండీ' అన్నాడు. నేను, 'సరే నన్నాను. వాడెళ్లాడు.అయిదు నిముషాల తర్వాత చల్లగా వచ్చేసి తన సీట్లో కూర్చున్నాడు. వాణ్ణి నేను అనుమానంచలేదు. నా పన్లో నేనుండిపోయాను.

'టుర్‌య, టుర్‌య, టుర్ర్ర్ర్ ర్ర్ర్ర్య టుర్‌య,టుర్‌య, టుర్ర్ర్ర్ర్ర్ర్య...'

ఈ శబ్దాన్ని అయిదు నిముషాలు గడిచాయి మళ్లీ వినిపించింది అదే శబ్దం. అయినా నేను పట్టించుకోలేదు.

మూడోసారి పట్టించుకున్నాను. గది అంచుకెళ్ళి చూసాను ఏ పక్షీ లేదు వేపచెట్టుమీద కానీ అక్కణ్ణించే నేలబారుగా వస్తోందా శబ్దం. చూసి చూసి వెనక్కి తిరిగాను. పచ్చగళ్ళ చొక్కా వాడెందుకో కొంచెం కంగారు పడ్డట్టు గమనించాను. కానీ నేను పట్టించుకోలేదు

అయిదు నిమిషాలాగి మళ్లీ వినిపించిందా శబ్దం జాగర్తగా విన్నాను అసలు, వింటినారి లాగి వదినట్టుండే 'టుర్‌య' శబ్దం, పెద్ద గద్ద తాలూకు కూత అని నాకు తెలుసు అయితే ఇప్పుడీత శబ్దం మాత్రం పొడుగూ పొట్టి 'టుర్‌య'లు కలగాపులగమై ఒక లయ అనేది లేకుండా వస్తోంది కనక ఇదొక కొత్త కూతనిపించింది. కనక ఇదొక కొత్త పక్షి అనిపించింది పక్షుల్ని గురించిన సిద్ధాంతాల్ని అవలీలగా కనిపెట్టేస్తున్న నాకు ఈ పక్షేదో తేల్చుకోకపోవటం మహా చెడ్డ అవమానమవ్వగలదనిపించింది దాంతో

నేను చెయ్యకూడని పనొకటి అప్పుడు చేసాను. గది అంచు దిగి, వేపచెట్టు వైపొక పాతికఅడుగులేసాను. ఆ శబ్దం ఆగింది కానీ, పక్షి కనిపించలేదు.

'ష్వీ.. ష్వీష్వ్!' అన్న శబ్దమూ దాంతో పాటే ఏదో వస్తువు ఎగిరొచ్చి నా గదిలో పడిన శబ్దమూ వినబడి చటుక్కున వెనక్కి తిరిగి చూద్దునుగదా, నా వెనకాలే గది బడట కొచ్చిన పచ్చగళ్ళ చొక్కావాడు పెద్ద కాగితం ఉండని నేలమీంచి అందుకొని గదిలోకి వడివడిగా వెళ్ళిపోబోతున్నాడు!

అంతే! ఒక్క దూకులోపోయి వాడి దగ్గర పడ్డాను. ఆ ఉండని పట్టుకున్న వాడిగుప్పెటతో అట్లాగే మూసుంచేసాను. ''చెప్పు ఎక్కడ్నించి పడిందీ ఉండ ?'' నిప్పులు కక్కుతూ గద్దించాను. వాడు ఏడుపు మొహం పెట్టేసి కందకం వైపుచూపించాడు. వాణ్ణలాగే పట్టుకొని కందకం అంచుకు ఈడ్చుకెళ్ళాను. కందకంలోకి చూద్దునుగదా, 'కిస్‌మి' బనీను కుర్రాడొకడు అవతలింట్లోకి దూకే ప్రయత్నంలో ఆదరాబాదరా ప్రహారీగోడెక్కుతున్నాడు!

నేను వీడితో అన్నాను '' మర్యాదగా వాణ్ణి నా దగ్గరికి రప్పిస్తావా, రెండేళ్ళో మూడేళ్ళో నిన్ను సమాధి చేసెయ్యమంటావా?''

'' ఒరేయ్, రారా, వెళ్ళోద్దురా, ప్లీజ్ వచ్చేయ్‌రా!'' అన్నాడు వీడు.

గోడెక్కుతున్న వాడల్లా ఆగి, రెండు మూడు క్షణాలు వెనక్కి నన్ను తేరిపార చూసి , అయిష్టంగానే గోడ దిగి, అతి కష్టంమీద కందకం ఎక్కి తలొంచుకుని నాదగ్గరకొచ్చాడు వాడు.

'' ఇప్పుడు శబ్దం చేసింది నువ్వేనా?'' నేనడిగాను.

అవునన్నట్లు తలూపాడు వాడు...... '' దేంతో?''

తన బొడ్డులోంచి వెడల్పాటి పంగల కర్ర తీసి చూపించాడు వాడు. దాని కొమ్ములకి సన్నని తీగె ఒకటి చాలా బిగుతుగా కట్టబడుంది. వాడు ఇంకో జేబులోంచి మేకు తీసి దాంతో ఆ తీగెను లాగి వదిలాడు. ' ట్కుర్ర్‌ర్ర్‌ర్ర్‌ర్ర్‌య.' శబ్దం వచ్చింది.

నేను గుచ్చి గుచ్చి అడగ్గా వాళ్ళిద్దరూ కక్కిన వాళ్ల పథకం ఇది. పక్షులంటే నాకిష్టం కనక, అట్లాంటి శబ్దంతోనే నా దృష్టిని పక్కకి మళ్లించి కందకంలోంచి గదిలోకి కావల్సిన కాపీ ముక్కల్ని సరఫరా చేసుకోవాలి!

ఇద్దరూ ఏడుపు మొహాల్తో నా ముందు నుంచున్నారు. ప్రిన్సిపాల్‌కో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌కో వీళ్ళ నప్పగించి మాన్యాలు పట్టించెయ్యగల్ను . నా స్థితిలో ఇంకో లెక్చరరు ఉన్నా లోక సహజంగా జరిగేదదే. అయితే సంస్కరించుకొని సంస్కరించు అనేది నావృత్తి. దాంతో ఐక్యమయిపోయింది నాప్రవృత్తి! కనకనే అటూ ఇటూ చూసి ఈ విషయం ఇంకెవరి దృష్టిలోనూ పడలేదని నిశ్చయించుకొన్నాను. వాళ్లని గోడ కిందగా నుంచోపెట్టాను లోగొంతుకతో అన్నాను. '' మీరు చేసింది ఎంతటి దౌర్భాగ్యపు పనో మీకు తెలుసు. నేనిప్పుడు తలుచుకంటే మీరేమవుతారో కూడా మీకు తెలుసు. అవునా? కానీ, అబ్బాయ్ పక్షి శబ్దాన్ని సృష్టి చెయ్యగల శక్తి మీకుందని నిరూపించుకున్నారు కానీ ఏం లాభం. మీరు గొప్పవాళ్ళవ్వాలని ఆశించి భగవంతుడు ఒక నైపుణ్యాన్ని మీకు ప్రసాదిస్తే దాన్ని మీరీ విధంగా దుర్వినియోగం చేసుకున్నారు. ఇది ఎంతటి పాపం! ఇది ఆ దేవుణ్ణే అవమానించటమని మీకెందుకు తోచదు? అసలు మీ వంటికి పడని ఈ కాలేజీ చదువు మీ కెందుకు? ఏ పాలిటెక్నిక్‌లోనో ఐ టి ఐ లోనో చదవకూడదూ! మీ తెలివికీ తగిన అవకాశమూ దొరుకుతుంది, లోకానికుపకారమూ జరుగుతుంది గదా! ఆలోచించుకోండి . ఈ సారికి వదిలిపెడుతున్నాను జాగర్త!'' మరుక్షణంలో 'కిస్‌మి' కందకం కిందికి జారి, గోడ దూకి

మాయమయ్యాడు. పచ్చగళ్ల చొక్కావాడు గదిలో కెళ్లి తలొంచుకుని రాతలో మునిగిపోయాడు.

ఆ తర్వాత రోజుల్లో పచ్చగళ్ళ చొక్కావాడు ప్రశాంతంగా తన పరీక్షలేవో తను రాసుకు వెళ్ళి పోయినట్టు గమనించాను. నేనింకో రెండు పిట్ట కూత సూత్రాల్ని కనిపెట్టాను.

* * *

అప్పుడు మేం కాఫీ తాగటం పూర్తయింది. శ్యాంఅన్నాడు "అయిదేళ్ళ తర్వాత కలిసాం. మీ రస్సలేం మారలేదేంటి మాస్టారూ. అన్నట్టు నాకు పాలిటెక్నిక్‌లో ఫస్టుక్లాసొచ్చింది సార్! కుక్కర్లు తయారు చేసే కంపెనీలో పని చేస్తున్నాను. అన్నం ఉడికి పోంగానే దానంతటదే కట్టేసుకునే కుక్కర్‌ను చవగ్గా తయారు చెయ్యటం నా లక్ష్యంగా పెట్టుకున్నాను. నా జీవితానికొక అర్థాన్ని లక్ష్యాన్ని చూపించిన అసలైన గురువులు మీరు! నా బ్రతుకును మంచికి మలుపు తిప్పిన మహానుభావులు మీరు! ఇప్పుడింకోసారి ఆశీర్వదించండి సార్, నాకు జయమవుతుంది!" ఇలా అంటూ చటుక్కున వంగి రెండు చేతుల్లోను నాపాదాలు ముట్టుకున్నాడు!

నా కళ్ళు చెమర్చాయి! గొంతు గాద్గదికమయింది! మనస్సు ఆనందంతో అల్లల్లాడిపోయింది!

ఎన్ని లక్షల ధనం సంపాదిస్తే దీనికి సమానమౌను ?

( ఆంధ్రసచిత్రవారపత్రిక 6-12 డిసెంబరు 85)

* * *  * * *  * * *

# సూదిమందు మోజు

**కేశవరావన్నాడు** : " చిన్న చిన్న రోగాల్ని పోగొట్టే చిట్కా వైద్యాలు ఇళ్లలోంచి మరుగైపోయి చాలా కాలమైంది. మన ఖర్మ కాలి జీలకర్ర లేహ్యం పేరుతో జీలకర్ర కాడల్ని లేహ్యం చేసి అమ్మే కంపెనీలు తయారయ్యాయి. ప్రజలు కూడా తాత్కాలిక రోగ విధానమే ప్రధాన మనుకుంటూ సూదిమందులకే ఎగబడుతున్నారు. కనక దేశీయమైన ఆయుర్వేదం ఆఖరి వాయువు పీలుస్తుంది. ఈ స్థితిలో పది మందికీ చేతనైనంతా సాయపడదామని నేను హోమియోపతిలో కృషి చేస్తున్నాను. ఇదే మన కిప్పుడు చవగ్గా అందుబాటులో ఉన్న వైద్యం. నీ కడుపు నెప్పి పోగొడతాను. నామందు తీసుకుంటావా?"

సుకుమార్ సిగ్గుపడ్డాడు. తరవాత మొహమాట పడ్డాడు. ఆ తరువాత ఇబ్బందిగా మొహం పెట్టి అన్నాడు " అఁ నీకు శ్రమెందుకులే. హెల్త్ సెంటర్లో తగ్గకపోతే నీ దగ్గరికి వస్తాన్లే"

" ఇప్పుడు నా మందుతో మూడు రోజుల్లో తగ్గే రోగం అలోపతి వాడాక మూడు నెల్లూ మూడేళ్లూ కూడా పట్టొచ్చు... నీ ఇష్టం!" కేశవరావు మిత్రుడింట్లోంచి బయటికి నడిచాడు. సుకుమార్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కి బయల్దేరాడు.

* * *